9

రంగమ్మ నవ్వు

ఇన్నాళ్లుగా లేనిది రంగమ్మకు ఈనాడు నవ్వు వస్తోంది.

ఉప్పూ, కారం తినే మామూలు మనిషే అయినా, కావాలని కష్టాలను కొనితెచ్చుకోకపోయినా, వచ్చిన కష్టాలకు తలొగ్గింది రంగమ్మ. తన సంగతి అనేదేదో ప్రత్యేకంగా ఉన్నదని రంగమ్మ ఎన్నడూ అనుకోలేదు. ఓ విధంగా అట్లా అనుకునే అవకాశమే లేకపోయింది రంగమ్మకు.

అయితే ఇన్నాళ్లూ లేని మార్పేదో తనలో వచ్చింది. ఆ సంగతి మొదట ఇతర్లు కనిపెట్టారు. ఇతరులంటే???...

ఇంతకూ రంగమ్మ ఎవరు? ఇంతమందిలో ఉంటూనే ఒంటరి ననుకొనే మనుషులలో ఒకతె రంగమ్మ. కోటంత కొంపలో ఒంటరిగా ఉంటూనే, మొక్కలనూ, ఇంట్లో పెంచే కుక్కలనూ తన తోబుట్టినవాళ్లుగా ఊహించుకోగల వ్యక్తి రంగమ్మ.

ఇరుగుపొరుగులోని తన ఈడు అందగత్తెలు పిల్లాజెల్లా తో సరదాగా ఉండడం చూచి తనకూ అటువంటి సుఖం కావాలన్న పెర పెర కలిగినా ఆ కోరికను తనలోనే దాచుకోగల యువతి రంగమ్మ.

గారాబంగా పెరగలేదు రంగమ్మ. పెద్ద పెద్ద చదువులు లేవు. తల్లి చిన్నతనంలోనే పోవడంవల్ల ఇంటికి తానే ఆడదిక్కయి పనిపాటలు బాగా నేర్చుకొన్నది. ఎనిమిదేళ్ళ రంగమ్మ ఇల్లలికి ముగ్గులుపెట్టి తండ్రికి కాచివడపోయడం ఇరుగుపొరుగుకే ఏమిటి, ఊరంతటికీ ఆశ్చర్యంగానే ఉండేది మొదట్లో.

ఇక రంగమ్మ తండ్రి రాజయ్యకు తల్లిదండ్రులు ఆ పేరు పెట్టినందుకు అనాలి. జీవితమంతా రాజకీయాలతోనే సరిపోయింది. అయితే స్వగ్రామంలో రాజకీయాలలో మాత్రం వేలుపెట్టేవాడు కాదు. ఒక పార్టీ అనేమీ లేదు. ఉప్పుసత్యాగ్రహంలో జైలుకు వెళ్ళివచ్చాడు. నాలుగెకరాల మాగాణి సొంతంగా సేద్యంచేసేవాడు. మంచి అనితోస్తే ఏ రాజకీయపార్టీ ఇచ్చిన కార్యక్రమాన్నయినాసరే అమలు జరిపేవాడు. రేషన్ రోజులలో కమ్యూనిస్టులు పేదలకు కిరసనాయిలూ, బియ్యమూ, గుడ్డలూ ఇప్పించాలని ఆందోళన ప్రారంభిస్తే రాజయ్య సమర్థించాడు. డెప్యూటీకలెక్టరుదగ్గరికి వెళ్ళి ప్రాథేయపడి నెలకు ఆరు డబ్బాల కిరసనాయిలూ, నలభై బస్తాల బియ్యమూ కోటా వేయించాడు. అమ్మకానికి ఎవరికి ఇవ్వాలి అని పంచాయతీ

అధ్యక్షుడు అడిగితే పంచాయతీయే సరుకు తీసుకొచ్చి సక్రమంగా పేదలకు మాత్రమే అమ్మాలని పట్టుపట్టాడు. అట్లా కొన్నిరోజులు గడిచిన తరువాత కమ్యూనిస్టులు ఏవో అఘాయిత్యాలు చేశారని తెలిసి, స్వయంగా చూచి కొందరిని అరెస్టు చేయించాడు రాజయ్య.

పంచాయతీ ఎన్నికలలో ఊళ్లో గలభాలకు కారణం అయినారని తాలూకా, జిల్లా కాంగ్రెసుసంఘాల కార్య కర్తలతో పేచీపడ్డాడు రాజయ్య.

అన్ని రాజకీయపక్షాలలోనూ రాజయ్యకు స్నేహితు లున్నారు; విరోధులుకూడా ఉన్నారు. ఇంతకూ ఇటువంటి రాజయ్య పెంపకంలో పెరిగిన రంగమ్మ సంగతే ఇప్పుడు మనకు అవసరం. రంగమ్మ అంటే రాజయ్యకు ఎటువంటి ఆపేక్ష ఉండేదో రంగమ్మకే కాదు – రాజయ్యను ఎరిగున్న వాళ్ళల్లో చాలామందికికూడా తెలియదు.

ఆపేక్ష సంగతి ఎందుకూ? తండ్రికి కూతురిపై ఆపేక్ష ఉండదా యేం? అందులోనూ ఒక్కగా నొకతే అయితే కూతురిమీద కాక మరెవరిమీద తండ్రికి ఆపేక్ష ఉంటుందీ? మిగతా తండ్రుల సంగతేమోగాని రాజయ్యకు మాత్రం ఈసూత్రం వర్తించదు. ఎందుకనంటే ఆపేక్ష అనడానికి గాని, ఆపేక్ష లేదు అనడానికిగాని రాజయ్య ఎవరికీ, ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదు. రంగమ్మ మంచానపడితే రాజయ్య మందు ఇప్పించకపోలేదు – అన్నం ఉడకేసి పెట్టలేదనీ కాదు.

ఒకసారి రంగమ్మ తండ్రికి చెప్పకుండా మేనత్తగారింటికి వెళ్ళింది. పదిరోజులయినా తిరిగి రాలేదు. "అయ్యో! నాకూతురు ఏమయిపోయిం"దని రాజయ్య కలతపడలేదు. కూతుర్ని వెంటపెట్టుకుని మేనత్త వచ్చినప్పుడు "చెప్పకుండా ఎందుకు వెళ్ళా"వని రంగమ్మను రాజయ్య దండించనూ లేదు.

ఇంత విచిత్రమైన సంస్కారం గల రాజయ్య పెంపకంలో తయారయిన రంగమ్మకు పంధొమ్మిదో యేటనే పసుపూ కుంకుమ దూరమయినవి. తండ్రి కరువయినాడు.

పొట్ట గడవదన్న భయం లేదు రంగమ్మకి. నాలుగెకరాల మాగాణీ తన పేరనే వ్రాశాడు రాజయ్య. ఇల్లు కూడా తన పేరనే ఉన్నది. హాయిగా చదువుకుందాం అని తండ్రి పోయిన మొదట్లో అనుకున్నది రంగమ్మ.

చిన్నప్పుడు – అదే, రజస్వలకాకముందు – అయిదో తరగతి పూర్తిచేసింది. బస్తీకి వెళ్ళి ప్రైవేటు పంతులును కుదుర్చుకొని ఆరునెలలు తంటాలు పడింది. చదువు రాదేమో ననిపించింది. చదువువచ్చినా రాకపోయినా ఆ ఆరునెలల్లోనే చాలా అనుభవం సంపాదించింది రంగమ్మ. ఆ అనుభవంలోని కష్టసుఖాలు కళ్ళకుకట్టినట్టు బస్తీలో కనిపిస్తున్నవి. కళ్లు తెరిచి చూడగలిగితే విషయాలు తెలుస్తయని తన తండ్రి అంటూండేవాడు. అదేమిటో ఆ ఆరునెలల్లోనూ రంగమ్మకు అర్థమయింది.

"ఛా...ఈ చదువూ వద్దూ, ఈ వేషాలూ వద్దు"

అనిపించింది రంగమ్మకు. అది రాజయ్య రంగమ్మకు ఇచ్చిన సంస్కారం!!

ఆ రావడం రావడం రంగమ్మ ఈ అయిదేళ్ళలోనూ మళ్ళీ ఊరు వదిలిపెట్టి ఎక్కడికీ వెళ్ళలేదు. తన నాలుగెకరాల కొండ్రా మేనత్తమొగుడు రాఘవయ్య సాగుచేస్తున్నాడు. రెండు రోజులకొకసారి వచ్చి 'కులాసాగా ఉన్నావా' అని అడిగి కష్ట సుఖాలు కనుక్కుపోతుంటాడు.

రాజయ్య ఇచ్చిన రాటం ఉన్నది. రాజయ్య చదివి వెళ్ళిన భగవద్గీత, భాగవతం, రామాయణం ఉన్నవి. బస్తీ నుంచి తను రెండు కుక్కపిల్లలనూ, రెండు పిల్లులనూ తెచ్చింది. దొడ్లో మొక్కలు వేసింది. అవన్నీ పెరిగి ఓ చిన్న తోటయింది.

ఈ విధంగా ఒడిదుడుకులు లేని దున్నపోతుల బండి లాగా సాగిపోతున్న రంగమ్మ జీవితంలో ఇన్నాళ్ళకు 'నవ్వు' మొలిచింది!!

తనో అందాల కుప్ప అని రంగమ్మ ఎన్నడూ అనుకోలేదు.

కాని ? ఇదివరకు లేని మార్పేదో తనలో వచ్చింది. మేనమామ పెద్దకొడుకూ, అయిదో క్లాసుదాకా చదువు చెప్పిన పంతులు నరసయ్యగారి పెద్దబ్బాయీ, ఎదుటింటి మునసబుగారి తమ్ముడూ తన ఇంటికి వచ్చిపోతున్నారు. వచ్చిపోతే యేం ? ఇంకా చాలామంది వస్తున్నారు. కొంచెంసేపు లోకాభిరామాయణ మేదో మాట్లాడి వెళుతు

న్నారు. అంతమాత్రాన ముంచుకుపోయిందేమీ లేదు. మగవాళ్ళతో మాట్లాడితేనే సిగ్గుదొంతరలు ముంచుకువచ్చే కుసుమకోమలగాత్రి కాదు తను!

సంసారసుఖం తెలియని మనిషి కాదు తను. కాని... కాని... మేనమామకొడుకూ, పంతులుగారి పెద్దబ్బాయీ, మునసబుగారి తమ్ముడూ తన ముఖంలోకి అదేపనిగా చూస్తున్నారు. తనతో మాట్లాడుతూ సందర్భం లేకుండా అదే పనిగా నవ్వుతారు. తనతో మాట్లాడుతూ మాట్లాడుతూండగానే వాళ్ళగొంతు లెందుకో బొంగురుపోతవి.

ఇదంతా రంగమ్మకు నవ్వులాటగా ఉన్నది.

పంతులు నరసయ్యగారి పెద్దబ్బాయి బియ్యే చదివాడు. పెళ్ళయింది. సంసారం చేస్తున్నాడు.

మేనమామ కొడుక్కు నలుగురు పిల్లలు.

మునసబుగారి తమ్ముడికి ఇంకా పెళ్ళికాలేదు. కాని, ఆడవాళ్లవల్ల పొందే సుఖం యేమిటో బాగా తెలిసినవాడు.

మరి వీళ్ళు తనను ఈ దృష్టితో ఎందుకు చూస్తున్నారూ? ఇంతా చేస్తే ఈ మగ వీరులకు తన కుక్కలను చూస్తే చచ్చేభయం. పెద్దకుక్క రాణి. అది వాకిట్లో పడుకొనిఉంటే తను దగ్గరున్నా లోపలికి రావడానికి భయపడే ధీరులు!!!

పోనీ, ఆ కాస్తమాటా, తనతో చెపితే యేం? తనను అడిగితే యేం? అడగరు. సాయంకాలం ఏ నాలుగు గంటలకో వచ్చి రాత్రి ఎనిమిదింటి దాకా కదలరు. ఏవేవో

ఖబుర్లు చెపుతారు. హావభావాలూ, వెకిలి చేష్టలూ కని పిస్తవి. అంతేగాని......

ఓసారి మునసబుగారి తమ్ముడు ఏదోపత్రిక తెచ్చి ఓ కథ చదివి వినిపించాడు. తీరిగ్గా విన్నది తను. ఆ పత్రిక తనకు ఇవ్వబోతున్నట్టు తన చేతితో చెయ్యి కలపజూచాడు. రంగమ్మ అది గమనించలేదు. తీరా గమనించిన తరువాత ఓసారి అతనికేసి అదోరకంగా చూచింది. ఇక ఆ తరువాత నాలుగు రోజులు తన ఇంటికి రావడానికే ఆ యువకుడు జంకాడు.

మరొక రోజు.

రంగమ్మ స్నానంచేసి ఇంట్లోకి వెళ్తూండగా మేన మామకొడుకు వెనుకనుంచి నెమ్మదిగా లోపలికి వచ్చాడు. పడకగదితలుపు వేసుకోడం మరచిపోయింది. లోపలికి వెళ్ళి చీరె కట్టుకుంటూండగా తనను......................

ఆ తరువాత "ఏమిటి...బావా...ఇది!" అన్నది రంగమ్మ.

"............"

"ఏం బాగా లేదు. నేను మీ ఇంటికి వస్తాను ఇవాళ సాయంకాలం. లేదా మామయ్యను ఓసారి రమ్మని చెప్పు ఇక్కడికి......"

"ఏం...ఎందుకూ..."

"ఎందుకేమిటే? ఈ వరస నాకేమీ బాగాలేదు. ఇటువంటివాడవని మీ నాయనకు తెలిస్తే బాగుంటుంది."

"చెప్పా...నువ్వు కూడా ఇటువంటిదానివని ఆయనకు తెలిస్తే బాగుంటుంది."

"అవును. నేను ఎటువంటిదానినో మీ అందరికీ తెలుసు. కాని అందుకు నేనేమీ బాధపడను. నీసంగతే మీ నాయనకు బాధ కలిగిస్తుంది. నేను మంచిదాన్నని మీ అందరితోనూ ఎన్నడూ చెప్పుకోలేదు. ఆఖరికి మీ ఇంటికి ఇంతవరకూ ఓ పూట తిండికికూడా నేను ఎన్నడూ రాలేదు. నా మానాన నేను పడిఉంటున్నా. ఇట్లా వెంటపడి ఆఖరికి నాకొంప కూల్చావు. ఇక దయచెయ్యి. చాలా గొప్పవాడివి," అన్నది తను. అంతే. మళ్ళీ ఆ బుద్ధిమంతుడు నెల రోజులదాకా తన ఇంటికేసి రాలేకపోయినాడు.

ఆ నెలరోజులలోనూ తను అతనికోసం చాలాసార్లు ఎదురుచూచింది. కారణం? ఎన్నిసంవత్సరాలకిందటనో ఆరిపోయిన తనలోని ఈ మంటను ఈ మగధీరులు రెచ్చగొట్టారు. ఏ పని చెయ్యబోయినా ఉత్సాహంగా ఉండడం లేదు. 'ఎందుకూ?' అనేప్రశ్న ఒకటి ఎప్పుడూ వేధిస్తోంది.

ఇదే తనలో వచ్చిన మార్పు. ఈ మార్పువల్లనే రంగమ్మకు ఈనాడు నవ్వు వస్తోంది.

తన సంగతి ఇట్లా ఉండగా, ఊళ్లో వాళ్లు రకరకాల పుకార్లు ప్రచారం చేస్తున్నారు.

పైగా మునసబుగారి తమ్ముడూ, మేనమామకొడుకే ఈ ప్రచారానికి సారథ్యం వహించారని ఆరాతీయగా తెలిసింది తనకు.

ఇంతవరకూ అటువంటి సాహసానికి దిగని పంతులుగారి పెద్దబ్బాయికి వీళ్లిద్దరూ తమ 'ఘనతను' అంటకట్టారు! ఎంత గొప్పవాళ్ళు? వీళ్ల మగతనం ఇట్లా కాక మరెట్లా సార్థకం అవుతుంది?

విచిత్రం ఏమిటంటే వాళ్లిద్దరూ మామూలుగా మళ్లీ తన ఇంటి చుట్టూ తిరుగుతూనేఉన్నారు. అయితే ఇది వరకూ అందరికీ తెలిసేటట్టు వచ్చేవాళ్ళు. ఇప్పుడు ఎవరికీ కనిపించకుండా ఉండాలని రాత్రిపూటా, తెల్లవారు ఝామునా వస్తున్నారు. అందుకనే తనుకూడా వాళ్ళకు వీలయినంతవరకూ దూరంగా తప్పుకుతిరగడానికి వీలవుతున్నది.

అందుకే రంగమ్మకు నవ్వువస్తోంది. ఈ మార్పు చాలా పెద్దమార్పు. ఆ సంగతి తనకు తెలిసినంతగా ఇతరులకు తెలియదు. కాని, పంతులుగారి పెద్దబ్బాయి సంగతి రంగమ్మకు మరీ నవ్వు తెప్పిస్తోంది. ఈ వదంతి బయలుదేరిన తర్వాత, పాపం, ఆయన తన ఇంటికి రావడమే మాని వేశాడు. ఒకసారి వస్తే బాగుండునని రంగమ్మకే అనిపిస్తే మాత్రం విచిత్రమేమిటీ?